# బోధివృక్షం నీడలో

**"సా**రథి ఇంకా రాలేదా...?" స్వగతంలా అనుకుంటూనే పి.ఏ. సంపత్ వైపు చూశారు ప్రముఖ రాజకీయ నాయకుడైన మాణిక్యాలరావుగారు. అప్పటికి అది మూడోసారి.

ఏం చెప్పాలో తెలియని సంపత్ "లేదండి" అన్నాడు వినయంగా.

ఆయన తన ముఖ్య సలహాదారుడైన సారథి కోసం అంతలా ఎదురు చూడటానికిగల కారణం ఏమిటంటే...

ఎన్నికల్లో పోటీ చేయటానికి అనుకున్నట్లుగా మాణిక్యాలరావుగారికే పార్టీ టికెట్ ఖరారైంది. అయితే, 'ఆసరా' అనే సేవాసదనాన్ని స్థాపించి, దాన్ని సమర్థంగా నిర్వహిస్తూ ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్న భక్తవత్సలం స్వామి కూడా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారనే విషయం ఆయన్ని బాగా కలవరపెట్టింది.

సేవాసదనంలో అనాథలైన వృద్ధులు, పిల్లలకే కాకుండా, అంగవైకల్యం కలవారికీ మానసిక వికలాంగులకీ ఆశ్రయం ఉంటుంది. ఆశ్రమానికి ధన, వస్తు రూపేణా విరాళాలు కొందరు ఇస్తే, మరికొందరు తమ సమయాన్ని కేటాయిస్తారు. వీలునుబట్టి వారానికి ఒక గంట, ఒకరోజు అలా కేటాయించిన సమయంలో సేవాసదనంలోని కొన్ని పనుల్ని నిర్వహించటమే కాకుండా, పిల్లలకు కథలు, కబుర్లు చెప్పటం, ఆటపాటలతో కాలక్షేపం చేయటం జరుగుతుంది.

కొండను ఢీకొట్టాలంటే భుజబలం సరిపోదు... బుద్ధిబలం చూపించాలి. గెలుపుకోసం డబ్బు ఖర్చు చేయటమే కాదు, భక్తవత్సలం గారి పేరు ప్రఖ్యాతులకి గండికొట్టాలి. ఆ ఆలోచనతోనే మాణిక్యాలరావుగారు, సేవాసదనానికి వచ్చే విరాళాల్లో అధికశాతం భక్తవత్సలంగారి సొంత ఖాతాలోకే జమ అయిపోతుంటే... అక్కడున్న వాళ్లు అరకొర సదుపాయాలతో దయనీయంగా బతుకుతున్నారని ఆరోపణలు చేశారు.

ఆ విమర్శలకి మనస్తాపం చెందిన భక్తవత్సలంగారు సేవాసదనాన్ని మాణిక్యాలరావుగారు ఒకసారి సందర్శించి ఆ తర్వాత మాట్లాడాలని సవాలు చేశారు. ఆయనకూ ఆ సవాలు స్వీకరించక తప్పలేదు. ఇక అందుకే... ఏ విషయాన్నయినా మసిపూసి మారేడుకాయ చేయటంలో ఘటికుడైన సారథిని తన ఆరోపణలకి తగిన రుజువుల్ని ఉపాయంగా సంపాదించమని పురమాయించారు. ఆ పని ఎలా చేసుకువస్తాడా అని సారథికోసం ఆయన ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఆ సాయంకాలమే సేవాసదనానికి వెళ్ళాల్సి ఉంది మరి!

ఫోనులో ఎవరితోనో ముఖ్యమైన విషయాన్ని చర్చిస్తున్న మాణిక్యాలరావుగారు గుమ్మం దగ్గర సారథిని చూసి రమ్మని చేయి ఊపారు. ఫోన్ పెట్టేసి "ఏమైంది?" అని అడిగారు. అప్పుడే లోపలి గదిలోనుండి కార్డ్‌లెస్ ఫోన్ తెచ్చిన సంపత్ "పెద్దమ్మగారి దగ్గర్నుండి.." అని చెప్పగానే హడావుడిగా "డబ్బు కావాలటనా...?" అనడిగారు. "కాదండీ... బాగానే ఉన్నామని చెప్పటానికి చేశారట" అని జవాబు చెప్పేసరికి ఆయన కనుబొమ్మలు చిరాకుతో ముడిపడ్డాయి. "ముసలాళ్ళకి చాదస్తం పెరిగిపోతోంది. బాగాలేకపోతే చేయాలి గానీ బావుంటే పనిగట్టుకుని చెప్పేదేంటీ" అని విసుక్కుంటూ 'సరేలే, పెట్టేయ్' అన్నట్లుగా చూసి "సారథీ చెప్పు" అన్నారు.

సారథి విషయం వివరించాడు.

సేవాసదనంలోని ఒక పెద్దావిడ చెప్పిన వివరాలు తమకు బాగా ఉపకరిస్తాయనిపించిందని చెప్పాడు. తమకున్న పాతిక ఎకరాల్నీ సేవాసదనానికి రాసిచ్చేసిన ఆ వృద్ధ దంపతులు అక్కడున్న అనాథలందరిలాగే సామాన్యంగా బతుకుతున్నారు. తమకు కావాల్సిన సమాధానాలు వచ్చేట్లుగా ఆవిడను తెలివిగా ప్రశ్నించి ఆ ఇంటర్వ్యూ పేపరులో వచ్చేట్లుగా చేస్తే, మాణిక్యాలరావుగారి ఆరోపణలకు తిరుగులేని సాక్ష్యంగా పనికొస్తుంది. ఆ పెద్దావిడ మాణిక్యాలరావుగారి సమక్షంలో ఆ వివరాలన్నీ చెబుతానందనీ, తమకి అనుగుణంగా రాసే జర్నలిస్టును కూడా ఏర్పాటు చేశాననీ సారథి చెప్పాడు.

మాణిక్యాలరావుగారు 'సెభాష్' అన్నట్లుగా అతని భుజం తట్టారు.

సంపత్ కూడా చిన్నగా నవ్వాడు. "ఇలా ఏదో ఉపాయంతో భక్తవత్సలంగారి ప్రఖ్యాతిని దెబ్బకొట్టకపోతే లాభం లేదు. నిన్నటి పేపరులో చూశాంగా. ఎవరో పెద్దాయన స్టేట్‌మెంట్ ఇచ్చాడు. 'ఎన్నికల్లో గెలిచినవాళ్ళు తమ కుటుంబ అభివృద్ధే చూసుకుంటున్నారు గానీ ప్రజల సంగతి పట్టించుకోవడం లేదు... భక్తవత్సలంగారి లాంటి నిజాయతీపరులైతేనే నలుగురికీ మేలుచేస్తారు అని".

మాణిక్యాలరావుగారు వ్యంగ్యంగా నవ్వారు. "మన కుటుంబం కోసం మనం సంపాదించుకోకూడదా..? ఏం మన కుటుంబసభ్యుల్ని ప్రజల నుండి ఎవరైనా మినహాయించారా? నలుగురికోసం ఎవరో ఒకరు ఎందుకు పాటుపడాలసలు? ఆ నలుగురూ ఏం చేస్తారటా..? మనం వండిపెడితే తిని కూర్చుంటారా? అయినా ఎవడి గొడవ వాడు చూసుకుని బాగుపడితే దేశం కూడా బాగుపడినట్లే కదా!".

'చాలా బాగా చెప్పారు' అన్నట్లుగా వాళ్ళిద్దరూ చిరునవ్వులు చిందించారు.

✤ ✤ ✤

ఆ సాయంకాలం ఎవరికీ తెలియపరచకుండా, మందీ మార్బలం హడావుడి లేకుండా సంపత్, సారథిలతో కలసి సేవాసదనం చేరుకున్నారు.

"అదిగో, ఆ పెద్దావిడ ఆ చెట్టుకిందే కూర్చుంది. ముందు ఆవిడతో మాట్లాడితే ముఖ్యమైన పని పూర్తవుతుంది" అంటూ సారథి అటు దారితీశాడు.

కుర్చీలు వేయబోతే వద్దని ఆమె పక్కనే చెట్టు చుట్టూ ఉన్న సిమెంటు చప్టా మీద ముగ్గురూ కూర్చున్నారు.

సారథి రెడీ అయి ప్రశ్నలు మొదలు పెట్టేశాడు.

"పెద్దమ్మా... మా అయ్యగారు వచ్చారు. నిన్న చెప్పిన విషయాలు మళ్ళా చెప్పాలి. పాతిక ఎకరాల్ని విరాళమిచ్చిన దాతలైనా మీరు ఏ సదుపాయాలూ లేకుండా చాలా అవస్థలు పడుతున్నారు. అనాథలందరిలాగే చిన్న గదిలో ఉంటూ వాళ్ళు తినేదే తింటున్నారు. అవును కదూ?"

"బాబూ... ఒక్క నిముషం ఆగు. నాకు నెలరోజుల్నుండి చూపు పూర్తిగా మందగించింది. కనిపించదని చెప్పాగా. వచ్చే నెలలో కళ్ళకి ఆపరేషను చేయిస్తామన్నారు ఏమనుకోకండి" అంటూ ఆవిడ వాళ్ళని చేతులతో తడిమి చూసింది.

ఆ తర్వాత నిదానంగా చెప్పింది. "ఇక్కడ ఎక్కువ తక్కువలు లేవు బాబూ. స్వామి ఈ సేవాసదనాన్ని తన కుటుంబమే అనుకుంటారు. ఏ తల్లయినా తండ్రయినా సంపాదించే బిడ్డకి ఒకలా సంపాదనలేనివాడికి ఇంకోలా భోజనం పెడతారా? సమానంగానే చూస్తారుకదా, స్వామి నలుగురు కోసం బతికే మంచిమనిషి".

ఈవిడేమిటి ఇప్పుడిలా మాట్లాడుతోందనే చిరాకులో ఉన్న సారథి మాణిక్యాలరావుగారి మాటల్ని అనుకరిస్తూ వ్యంగ్యంగా "నలుగురి కోసం ఎవరో ఒకరు పాటుపడటమెందుకు పెద్దమ్మా... చెప్పు.. ఎవరి గొడవ వాళ్ళు చూసుకుని బాగుపడితే, దేశం అంతా బాగుపడినట్లే కదా?" అన్నాడు.

"లేదు బాబూ, పొరబడుతున్నావు" అంటూ తలాడించింది. "ఏ ఒక్కరైనా నలుగురి తోడ్పాటు లేకుండా బతకగలరా? నలుగురూ లేందే మనిషి మనుగడే లేదు. కుటుంబంలో

ఒకరు సంపాదిస్తే, ఒకరు వండిపెడతారు. పెద్దల్నీ పిల్లల్నీ ఒకరు చూడాలి. ఏ మనిషైనా తన తిండినీ బట్టనూ తయారు చేసుకుని, తనకి కావాల్సిన వైద్యాన్ని తనే చేసుకోగలడా? నలుగురి మీదా ఆధారపడాల్సిందే కదా! కొందరు గొప్పవాళ్ళు సమాజాన్నే తమ కుటుంబం అనుకుని నిస్సహాయులూ నిర్భాగ్యుల కోసం మంచి మనసుతో పనిచేస్తారు".

"ఏంటి పెద్దమ్మా, పల్లెటూరు నుండి వచ్చానన్నావ్.... పెద్ద చదువులు చదివిన దానిలా మాకు పాఠాలు చెబుతున్నావ్?" కొంచెం వెటకారంగా, మరింత చిరాగ్గా అన్నాడు సారథి.

"నిజమే బాబూ... నేను చదువుకోలేదు కానీ నలుగురి మధ్యా బతికినదాన్ని. ఒక మాట అడుగుతాను... జవాబు చెప్పు. ఒకవైపు పెద్ద భవంతితో పాటు ఏది కావాల్సినా లోటు లేకుండా అమర్చి పెట్టే యంత్రసామగ్రి.... ఇంకొకవైపు నలుగురితో కలిసి కష్టపడే జీవితం... ఏది కావాలో కోరుకోమంటే ఎవరైనా ఏది కావాలంటారు? ఒంటరిగా ధనరాసుల మధ్య బతుకుతానని ఎవరైనా అంటారా? మనిషికెప్పుడూ మనిషి తోడు కావాలి! అందుకే ఒకరికొకరు సాయపడాలి. అంతేగానీ ఎవరి గొడవ వాళ్లు చూసుకుంటే సరిపోతుందని ఎలా చెప్పగలవ్?" అని క్షణం ఆగింది.

"నా అనుభవమే చెబుతాను. పెద్దవాళ్ళతో మాట్లాడే అవకాశం మళ్ళీ నాకు దొరకదు. కొంచెం ఓపిగ్గా వినండి బాబూ" అంటూ మొదలు పెట్టింది.

"నా పేరు రాముడమ్మ. మా ఆయన పేరు సీతయ్య. మాకు ఒక్కడే కొడుకు. హైస్కూలు చదువు అవగానే పై చదువులకనీ ఆ తర్వాత ఉద్యోగమనీ పై ఊళ్ళలో మాకు దూరంగానే ఉండేవాడు. అయినా మా ఊళ్ళో మేం ఇద్దరమే ఉంటున్నట్లుగా అనిపించేదికాదు. తెల్లారిలేస్తే మా ఇంటికి 'రాముడత్తా, రాముడు పిన్నీ, పెద్దమ్మా, అవ్వా' అని పిలుస్తూ పిల్లలూ పెద్దలూ ఏదో ఒకపనిమీద వస్తూనే ఉంటారు. సాయంకాలాలు "సీతయ్య మావా, సీతయ్యన్నా" అంటూ పదిమంది పెద్దలు వచ్చి మా ఇంటి ముందే సమావేశమయ్యేవారు. ఊరంతా కలిసికట్టుగా ఒక కుటుంబంలా ఉండి కష్టసుఖాలు చెప్పుకునేవాళ్ళు, ఎవరింట్లో శుభకార్యం జరిగినా, ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆ రెండు రోజులూ వాళ్ళ దగ్గరే ఉండిపోవటం మా అలవాటు. అందుకేనేమో మమ్మల్ని ఊరిపెద్దలుగా గౌరవించేవాళ్ళు. ఊరందరి అభిమానం వల్లనే మా అబ్బాయి దగ్గరలేడనే లోటు మాకు తెలిసేది కాదు.

మాకున్నకాస్త పొలాన్ని ఎవరో కౌలుకి తీసుకుని మాకు ధాన్యాన్ని కొలిచి పోస్తుంటే మాకు గడిచిపోతోంది. వరసగా పంటలు పండక కరువొచ్చిపడింది. మా ఊరుకి సరైన రోడ్లు లేవు, నీటి వసతి లేదు. ఒక హాస్పటల్ లేదు. ఎవరికి ఏ రోగమొచ్చినా పొరుగూరికి పరుగెట్టాల్సిందే! రోడ్లు సరిలేక ఊళ్ళోకి బస్సు రాదు. మైలున్నర దూరం వెళ్ళి బస్సెక్కాలి. ఎన్నికలప్పుడు ఎవరో వచ్చి అన్నీ చేస్తామంటారుగానీ చేసేది మాత్రం ఉండదు. అందుకే మా ఊరి వాడినే ఎన్నికల్లో నిలబెట్టాలని అందరూ కలిసి అనుకుని, చదువుకున్న మా అబ్బాయి అయితేనే బావుంటుందని వాడిని పిలిపించి అడిగారు. వాడూ సరేనన్నాడు.

ఊళ్ళో వాడు చదువుకునే రోజుల్లో...  ఒక కుర్రాడు చెట్టుమీద నుండి పడి కాలు విరగ్గొట్టుకున్నాడు. ఎవరైనా బండి కట్టుకుని వచ్చేవరకూ ఆగకుండా ఆలస్యమైపోతుందని మావాడు ఆ కుర్రాడిని వీపుమీదేసుకుని బస్సు కోసం పరుగు పెట్టేశాడు. 'అంత బరువుతో అంత దూరం ఎలా నడిచావురా?' అని నేను ఆశ్చర్యంగా అడిగితే 'ఆలస్యమైతే వాడికేమైనా అవుతుందేమోననే ఆదుర్దాలో నాకు బరువే తెలియలేదమ్మా' అని జవాబు చెప్పాడు. వాడిది అంత మంచిమనసు! అందుకే ఎన్నికల్లో పోటీ చేస్తాననగానే ఊరికి మేలు జరుగుతుందని నేనూ చాలా సంతోషించాను.

అందరూ కలిసికట్టుగా పనిచేసి మావాడిని పెద్ద మెజారిటీతో గెలిపించారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచినవాడిని అధికారపక్షంవాళ్ళు పార్టీలో కలుపుకుని పెద్ద పదవినీ ఇచ్చారు...."

సంపత్ మధ్యలో కలుగజేసుకుని "అయితే ఇంకేం... మీ అబ్బాయి దశ తిరగిపోయిందన్నమాట!" అన్నాడు.

ఆవిడ నిట్టూర్చింది. "అవును బాబూ దశ తిరిగింది.. దెస మారిపోయింది! మా రెండు గదుల పెంకుటిల్లు పడగొట్టి పెద్ద ఇల్లు కట్టాడు. పాతిక ఎకరాల పొలం పక్క ఊళ్ళో కొన్నాడు. బీరువాలో డబ్బు, బంగారం పెట్టాడు. పిల్లల్ని పై చదువులకోసం విదేశాలకి పంపించాడు. మా మాటలు వినిపించనంత ఎత్తుకి వెళ్ళిపోయాడు. ఊరు పరిస్థితిలో మాత్రం మార్పు లేదు.

ఒకసారి మా ఊరుకి సేవాసదనం సైనికులు వచ్చారు. చదువుకునే కుర్రాళ్ళూ, కొందరు ఉద్యోగాలు చేసేవాళ్ళూ తమ సెలవు దినాల్లో సేవాసదనం తరపున పనిచేస్తారట.  వాళ్లు చుట్టుపక్కల పల్లెటూళ్ళు తిరిగి ఏవో చేయగలిగిన సేవాకార్యక్రమాలు చేస్తుంటారట. మా ఊళ్ళో సభ పెట్టి సమస్యల్ని తెలుసుకుని 'మీ ఊరివాడే పెద్ద పదవిలో ఉంటే ఈ సమస్యల్ని ఆయన దృష్టికి ఎందుకు తీసుకెళ్ళలేదూ?' అనడిగారు. పదిమంది కలిసి రెండుసార్లు వెళ్ళొచ్చామని చెప్పారు. మొదటిసారి బాగానే మాట్లాడి అలాగే చేస్తానని అన్నాడట. రెండోసారి వెళ్ళినప్పుడు గేటు పక్కనే ఉన్న చెట్టుకింద కూర్చుని ఎదురుచూస్తుంటే, ఇద్దరు ఆఫీసర్లు వీళ్ళ గురించి వేళాకోళంగా మాట్లాడుకోవటం వీళ్ళకి వినిపించింది. 'తెల్లారేసరికల్లా పనీపాటా మానుకుని కాగితాలు పట్టుకుని కాకులు దిగబడిపోయాయి' అని ఒకాయన నవ్వితే, ఇంకొకాయన 'ఏ కాగితాలిచ్చి పనులు చేయించుకోవాలో తెలియని పిచ్చిజనం' అంటూ ఎగతాళి చేశాడట. అది అవమానంగా అనిపించి, డబ్బులివ్వందే అక్కడ పనులు కావని అర్థమయ్యి మళ్ళీ వెళ్ళలేదని మా ఊరివాళ్ళు చెప్పారు.

ఆ అవమానానికి ప్రతీకారంగానూ, చేసిన వాగ్దానాలు మరిచిపోయినందుకూ సేవాసదనం సైనికులు ఒక కొత్తరకం శిక్షని మాకు విధించారు.  మా ఊరివాళ్ళు ఆ శిక్షని అక్షరాలా అమలు జరిపారు. ఊరివాళ్ళంతా మాతో మాటామంతీ బందు చేశారు. మా ఇంటికి ఎవరూ రారు. మునుపటిలానే పాలు, కూరగాయలు తెచ్చి ఇంటిముందు పెట్టడం, డబ్బులు

ఎక్కువిచ్చినా, తక్కువిచ్చినా మాట్లాడకుండా తీసుకోవటం.. అంతే! తెల్లారి లేచిన దగ్గర్నుండీ నలుగురితో గలగల మాట్లాడే అలవాటున్న మేము ఊరివాళ్ళ తిరస్కారాన్ని భరించలేకపోయాం.

ఒకసారి మా దూరపు బంధువుల అబ్బాయి కడుపునొప్పితో చనిపోయాడని తెలిసి విలవిలలాడుతూ పరిగెట్టుకుని వెళ్ళాం. పొరుగూరు తీసుకెళ్ళటంలో సమయానికి బస్సు లేక ఆలస్యమై చనిపోయాడని అక్కడ అనుకుంటున్నారు. మేమే దానికి కారణమని నిందిస్తున్నట్లుగా ఆ పిల్లాడి తల్లి నావైపు చూసిన చూపుకి నేను తట్టుకోలేకపోయాను. ఆ రకం తిరస్కారాల్నీ అవమానాల్నీ ఎన్నాళ్ళో భరించలేక మేమూ మా అబ్బాయి దగ్గరకు వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాం. అలాంటి శిక్షకి మమ్మల్ని గురిచేసిన వాడిని నిలదీయాలనీ అనుకున్నాం.

ఇంట్లో ఉన్న డబ్బు, బంగారం ముఖ్యమైన కాగితాల్ని ఒక బ్యాగులో, మరొకదానిలో మా బట్టల్నీ సర్దుకున్నాం. ఆ వేళ మా ఆయనకి ఒళ్లు కొంచెం వెచ్చబడింది. అయినా బస్సు కోసం మైలున్నర దూరం నడవక తప్పదు. సాయంకాలం అయిదు గంటలకి మేం బయలుదేరిన కాసేపటికే బాగా మబ్బేసి చీకటి వచ్చేసింది. పక్క ఊరికి మలుపు తిరిగే చోట రోడ్డుమీద బస్సు ఆగుతుంది. ఇంకా బారెడు దూరం ఉండగానే సన్నని వానజల్లు మొదలైంది. అంతకుముందురోజు బాగా గాలీ వానా రావటంతో రోడ్లన్నీ బురదమయమైపోయాయి. కాళ్ళీడ్చుకుంటూ చాలా కష్టంగా నడవాల్సి వచ్చింది.

రోడ్డుమీద అటువైపు పెద్ద చెట్టు ఉంటే, అక్కడ కాసేపు తలదాచుకుందామని అటు వెళ్ళటానికి రెండడుగులు వేయగానే నీటిగుంటలోకి మా ఆయన జారిపోయాడు. అక్కడ ఏదైనా గొయ్యి తవ్వారో, నీటి వరవడికి నేల కొట్టుకుపోయిందో తెలియదు. నేలమీద కాళ్ళు ఆనటం లేదని అంటే, సంచులు రెండూపక్కన పడేసి, ఆయన చేతిని గట్టిగా పట్టుకున్నాను.

చీకటి... మనుషుల అలికిడి లేదు... వాన తుంపర! ఇద్దరం వయసుమళ్ళిన వాళ్ళమే. అంతదూరం నడిచివచ్చిన ఆయాసం... నీరసం... ఆయన్ని గట్టిగా పట్టుకునీ పట్టుకునీ చేతుల్లో కూడా శక్తి సన్నగిల్లిపోతోంటే... కీచుగొంతుతో 'బాబూ....ఎవరైనా కాపాడండీ' అని ఆగి ఆగి కేకలు పెట్టాను. మూడు నాలుగు గంటల సేపు పళ్ళ బిగువున ఆ బాధని భరించాను. ఇంకాసేపుంటే మా ఇద్దరికి స్పృహతప్పి ప్రాణాలు పోవటం ఖాయమని అనుకుంటున్న సమయంలో... ఏదోజీపు అటు ఊరివైపు మలుపు తిరగబోతూ ఆగి మా దగ్గరికి వచ్చింది. దేవుడు పంపిన దూతల్లా నలుగురు కుర్రాళ్ళు దిగివచ్చి మమ్మల్నిద్దర్నీ చేతులమీద ఎత్తుకుని తీసుకువెళ్ళి జీపులో కూర్చోబెట్టారు.

మా దగ్గరున్న సంచుల్లో డబ్బు, బంగారం ఉన్నాయిగానీ మాకు సాయపడలేకపోయాయి.

నలుగురు మనుషులే మమ్మల్ని రక్షించారు! మనుషుల విలువ మనుషులదే.. దేనికీ సాటికాదు. ఆ సమయంలో ఈ విషయం నాకు స్వానుభవంతో అర్థమైంది!

ఆ కుర్రాళ్ళు సేవాసదనం సైనికులేనట! వాళ్ళ ఊరి డాక్టరుగారు జీపు ఇస్తే పక్క ఊరుకి వెళ్ళి వస్తున్నారు. వాళ్ళందరివీ పక్కపక్క ఇళ్ళే. మమ్మల్ని వాళ్ళ పెద్దవాళ్ళు వచ్చి పరామర్శించి ఆదరంగా అందరిళ్లల్లోవీ తెచ్చి భోజనాలు పెట్టారు.

ఆకలి బాధ ఎంత భయంకరమైనదో మాకు ఆరోజే అర్థమైంది. అమృతం లాంటి అన్నం రుచీ మొదటిసారిగా ఆ రోజే తెలిసింది.

ఆ తర్వాత ఆ పిల్లలు చెప్పుకుంటున్న కబుర్లు మా చెవినపడ్డాయి. వాళ్ళందరూ పేద విద్యార్థుల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న వాళ్ళే. వాళ్ళ హాస్టల్‌కి వచ్చే నిధుల్ని నిజాయితీగా ఖర్చుపెట్టే ఆఫీసర్ని ప్రభుత్వంలోని ఒక పెద్దాయన బదిలీచేసి ఇంకొకర్ని వేశాడట. ఎందుకంటే ఇతను అరకొర సౌకర్యాలతో సరిపెట్టేసి, మిగులు డబ్బును తన కొంత స్వాహా చేసి పెద్దాయనకు మరింత ముట్ట చెబుతాడట. పేదల నోటిదగ్గర ముద్దకీ కక్కుర్తిపడే ఆ పెద్ద మనిషి నైచ్యానికి మాకుకడుపులో తిప్పింది.... సిగ్గుతో చితికిపోయాం. ఎందుకంటే పేరుని బట్టి ఆ మనిషి మా అబ్బాయేనని తెలిసింది. ఇక వాడింటికి వెళ్ళి, ఆ తిండి తినటానికి మాకు మనసొప్పలేదు. మమ్మల్ని సేవాసదనంలో చేర్చమని ఆ పిల్లల్ని అడిగి మా పేరనున్న పాతిక ఎకరాల్నీ రాసిచ్చేశాం.

మేం మొదటినుండీ సిరిసంపదలతో తులతూగినవాళ్ళం కాదు... నలుగురితో కలిసి మెలిసి ఆనందంగా బతికినవాళ్ళం... అంతే! ఇప్పుడిక్కడ మాకు మళ్ళీ మా పాత జీవితం దొరికింది. ఈ చెట్లమధ్య... నలుగురితో కలిసి ఆనందంగా బతుకుతున్నాం. ఇక్కడ ఎవరి పరిస్థితీ దయనీయంగా లేదు.

బాబూ.... నేనొక మాట చెప్పటానికే మిమ్మల్ని రప్పించాను. అవినీతికి పాల్పడటం నేరమైతే... నిజాయితీపరుడిపై తెలిసీ నిందారోపణలు చేయటం మహా నేరం!!

మనం నలుగురి మేలు కోసం త్యాగాలు చేసే మహాత్ములం కాలేకపోవచ్చు. కానీ, మహాత్ములను హత్యచేసే దురాత్ములం మాత్రం కాకూడదు" ఆవిడ గొంతు ఆ మాటల్ని మంద్రంగా, ఆర్ద్రంగా పలికింది.

ఆవిడ మాటలు పూర్తవుతుండగానే మాణిక్యాలరావుగారు సీరియస్‌గా లేచి వెళ్ళిపోయారు. దూరంగా ఉన్న సెక్యూరిటీవాళ్లు హడావుడిగా అనుసరించారు.

ఆవిడ నిట్టూరుస్తూ సారథితో మళ్ళీ అంది "నా మనసులోని ఈ నాలుగు మాటలూ చెప్పుకోవాలని మీ అయ్యగార్ని రప్పించటానికే నిన్న మీతో అలా చెప్పాను బాబూ.."

"భలేదానివమ్మా, ఒకటి చెబుతానని ఇంకొకటి చెప్పి రసాభాస చేశావు! తీరికగా నీ కథ వినిపించటానికి మా అయ్యగారేమైనా పనీపాటా లేని మనిషనుకున్నావా? ఆయనకు క్షణం తీరికుండదు. నువ్వు చేసినపనికి నేనేం చెప్పుకోవాలో... " లబలబలాడుతూ పరుగులు పెట్టాడు సారథి.

✤ ✤ ✤

ఆ రాత్రంతా కలవరపాటుతో గడిపిన సారథి మరునాడు ఉదయమే దిగులుగా మాణిక్యాలరావుగారి నివాసానికి చేరుకున్నాడు.

సంజాయిషీ ఎలా ఇచ్చుకోవాలో రకరకాల ఆలోచనలు చేశాడు.

సంపత్ ఎదురొచ్చి "సారథీ ... విన్నావా...?! మన అయ్యగారు భక్తవత్సలంగారికి మద్దతుగా పోటీనుండి విరమించుకోవటమే కాకుండా, ఆ మధ్య కొన్న లక్షల ఖరీదు చేసే స్థలాన్ని సేవాసదనానికి రాసిచ్చేయాలని నిర్ణయించుకున్నారట! రాత్రికి రాత్రే ఆ ఏర్పాట్లు మొదలు పెట్టేశారు. తాత్కాలికంగా రాజకీయాలనుంచి విరమించుకుని వాళ్ళ సొంత ఊరికి వెళ్లిపోతారట!" అని చెప్పాడు.

"నేనసలే దిగులుతో చస్తుంటే.... నీకు నాతో వేళాకోళాలాడాలనిపిస్తోందా?" సారథి చిరాకుపడ్డాడు.

"కాదయ్యా బాబూ, వినటానికి విడ్డూరంగా ఉన్నా నూటికి నూరుపాళ్ళూ నిజం! ఆ మధ్య నేనెక్కడో చదివాను... ఒక డాక్టరు తన చేతి స్పర్శతోనే రోగాలు నయం చేస్తున్నాడని! నిన్న ఈ విషయంలో నాకు రుజువు దొరికింది. నువ్వు గమనించావో లేదో గాని మనం అక్కడ ఉన్నంతసేపూ ఆ ముసలావిడ అయ్యగారి చేతిని పట్టుకునే ఉంది. ఇనుమును బంగారంలా మార్చేసే పరుసవేది శక్తేదో ఆవిడ చేతిస్పర్శకీ ఉంది కాబోలు! లేకపోతే తెల్లారేసరికల్లా అయ్యగారిలో ఇంత మార్పు ఎలా వస్తుందీ? నిజంగా అద్భుతమే!!"

సంపత్ మాటలకి సారథి తెల్లమొహం వేశాడు. లోపలకు వెళ్ళాక మాణిక్యాలరావుగారిని చూస్తూనే "ఏమిటి సార్, ఆ చెట్టుకింద ముసలావిడ చాదస్తంగా ఏదో చెబితే..." అంటూ నసిగాడు.

ఆయన చిరునవ్వుతో చూశారు. "నలుగురికీ నాయకుడు కావాలనుకునేవాడు ఆ అర్హత కోసం ముందు నలుగురితో కలిసి నలుగురి మధ్యా కష్ట సుఖాలు తెలుసుకుంటూ బతకాలి. ఈ విషయం నిన్ననే తెలుసుకున్నాను" అన్నారు.

పైకి చెప్పలేని మాటల్ని ఆయన మనసులో మననం చేసుకున్నాడు... 'కన్న తల్లిదండ్రులు సేవాసదనంలో ఉంటున్నారనే విషయాన్ని కూడా తెలుసుకోలేనంతగా కుటిల రాజకీయాల్లో కూరుకుపోయిన నన్ను గుర్తుపట్టి కూడా పట్టనట్లుగా ... చెప్పకనే చెప్పినట్లుగా అమ్మ తన చేతి స్పర్శతో సందేశం ఇచ్చింది! మరణశయ్య పైనున్న నా మనస్సాక్షిని బ్రతికించింది!'.

ఈనాడు ఆదివారం. 13, జూన్ 2010